



పర్యాటకుల సందడి

బిరబిరా పరుగులు





శ్రీశైలం డ్యాం నుంచి మూడు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

● నిండుకుండను తలపిస్తున్న శ్రీశైలం డ్యామ్ ● మూడు గేట్లు ఎత్తి నీటి విడుదల
● జలాశయం వద్ద పర్యాటకుల సందడి

శ్రీశైలం, జూలై 29: శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తడంతో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు మూడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసా గుతోంది. జూరాల, సుంకేశుల నుంచి వరద ప్రవా హం పెరగడంతో డ్యామ్ మూడు క్రస్టుగేట్లను సాయం త్రం 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 3,03,984 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 1,48,599 క్యూసెక్కులు మొత్తం 4,52,583 క్యూసెక్కుల మేర వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయా నికి 4,51,080 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశ యానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 879.20 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 184.2774 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 26,495 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసె క్కులు, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 76,056 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. కార్యక్రమంలో ముందుగా జలాశయం సీఈ కబీర్‌బాషా, ఏఈ శ్రీరామచంద్రమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి 6,7,8 గేట్లను ఎత్తి నీటిని వదిలారు. జలాశయం ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే మరో రెండు గేట్లు తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

శ్రీశైలం జలాశయం వద్ద పర్యాటకుల సందడి

శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో జలాశయం పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా సందర్శకులు జలాశయం అందాలను వీక్షించేందుకు తరలివచ్చారు. దైవదర్శనార్థం శ్రీశైల క్షేత్రానికి విచ్చేసి ముందుగా భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని అనంతరం డ్యామ్‌ను వీక్షించేందుకు ఎగబడ్డారు. శ్రీశైలం డ్యామ్ నుంచి కిందకు దూకుతున్నపుడు ఎగసిపడుతున్న నీటి జల్లుల్లో తడుస్తూ, కేరింతలు వేస్తూ అక్కడి దృష్యాలను పర్యాటకులు వారి ఫోన్లలో చిత్రీకరించుకుంటూ ఆనందించారు. ఇదిలా ఉండగా పర్యాటకుల వాహనాలతో ఘాట్ రోడ్లన్నీ రద్దీగా మారాయి. వారాంతరాల్లో జలాశయాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల



పోతిరెడ్డిపాడు నుంచి విడుదల అవుతున్న జలాలు

జూపాడుబంగ్లా, జూలై 29: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి దిగువకు అధికారులు నీటివిడుదలను పెంచారు. ఆదివారం ఆరుగేట్ల నుంచి 18వేల క్యూసెక్కులు విడుదల చేయగా, సోమవారం శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతం జూరాల, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి భారీగా ఇన్‌ఫ్లో 4లక్షలకుపైగా క్యూసెక్కుల వరదనీరు రావడంతో సాయంత్రం 23వేల క్యూసెక్కులకు పెంచి నీటిని ఎస్సార్బీసీ కాలువలోకి విడుదల చేశారు. ఆ నీటిని బానకచర్ల నీటిసముదాయం నుంచి తెలుగుగంగకు 10వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ 5వేల క్యూసెక్కులు, గాలేరునగరి కాలువకు 8వేల క్యూసెక్కుల చొప్పున మళ్లిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



ఎగువ పుష్కరఘాట్లను తాకుతున్న వరద జలాలు

పుష్కరఘాట్లను ముంచెత్తుతున్న వరద

కొత్తపల్లి: ఎగువ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు దిగువన ఉన్న కృష్ణానదికి భారీ ఎత్తున వరద నీరు కొనసాగుతుంది. దీంతో సోమవారం కూడా 4.50 లక్షల క్యూసెక్కులకు పైగా శ్రీశైలం జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఎగువ ప్రాంతాన ఉన్న ఉమామహేశ్వరం ఆలయం వద్ద ఉన్న పుష్కరఘాట్లను వరదజలాలు ముంచెత్తుతున్నాయి. ఇప్పటికే ప్రాచీన సంగమేశ్వరాలయం నది గర్భంలోకి వెళ్లడంతో పర్యాటకులు, భక్తులు ఎగువ ఉమామహేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. శ్రీశైలం జలాశయం నిండుకుండలా ఉండటంతో ఈ ప్రాంత మత్స్యకారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. రెండు రోజులుగా పర్యాటకుల సందడి చేస్తున్నారు.

నేడు అవుకు రిజర్వాయర్‌కు చేరనున్న కృష్ణా జలాలు

అవుకు: అవుకు రిజర్వాయర్‌కు మంగళవారం సాయంత్రానికి కృష్ణా జలాలు చేరుకోనున్నట్లు ఎస్సార్బీసీ అధికారులు సోమవారం తెలిపారు. ఈనెల 27వతేదీన పోతిరెడ్డి హెడ్‌రెగ్యులేటర్ నుంచి ఎస్సార్బీసీ కాల్వకు అధికారులు నీటిని విడుదల చేశారు. అవుకు రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 4.148 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.051టీఎంసీల నిల్వ ఉంది. గోరుకల్లు నుంచి ఎస్సార్బీసీ కాల్వకు మధ్యలో ఉన్న స్లూయిస్‌లను అన్నింటిని ప్రస్తుతం మూసివేసి నేరుగా అవుకు రిజర్వాయర్‌కు 660 క్యూసెక్కుల నీరు చేరే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. అవుకు రిజర్వాయర్‌కు నీరు చేరిన రెండు, మూడు రోజుల తరువాత ఎస్సార్బీసీ కాలువ పరిస్థితిని బట్టి 1,000 క్యూసెక్కుల పైగా నీటి విడుదలను పెంచే అవకాశం ఉన్నట్లు ఎస్సార్బీసీ అధికారులు తెలిపారు.

అవుకు రిజర్వాయర్



నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్టులో 87 పులులు

ఎన్ఎస్టీఆర్ అధికారులను అభినందించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

ఆత్మకూరు, జూలై 29: దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా పేరుగాంచిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో 87 పెద్దపులులు ఉన్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. సోమవారం ప్రపంచ పెద్దపులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని అరణ్య భవన్‌లో ఏర్పాటు చేసిన వరల్డ్ టైగర్ డే కార్యక్రమానికి హాజరై పెద్దపులుల సంరక్షణపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నల్లమలలోని ఎన్ఎస్టీఆర్ పరిధిలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఫేస్-4 పులుల కనీస గణాంకాలను వెల్లడించారు. గత ఏడాది ఎన్ఎస్టీఆర్ పరిధిలో 74పులులు, 6 పులికూనలు ఉండగా ఈ సారి గణాంకాల్లో 76పులులు, 11పులికూనలు ఉన్నట్లు అంచనాలు ప్రకటించారు. ఈ లెక్కన గతేడాదితో పోల్చితే నల్లమలలో 11 పులులు పెరిగినట్లు తెలుస్తోంది.



నల్లమలలోని పెద్దపులుల ఫొటోలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

ఇందుకు కృషిచేసిన అటవీశాఖ అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశా నికి ఎన్ఎస్టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ బీఎన్‌బీఎన్.మూర్తి, ఆత్మకూరు, నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం ప్రాజెక్ట్ టైగర్‌ల డిప్యూటీ డైరెక్టర్లు సాయిబాబా, అనురాగ్ మీనా, నరసింహారావు, విఘ్నేష్‌అప్పావ్, బయోడైవర్సిటీ రీసర్చ్ సెంటర్ ఏసీఎఫ్ ధనురాజ్, దోర్నాల రేంజ్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు హాజరయ్యారు.

ఆగస్టు 1న శ్రీశైలానికి సీఎం చంద్రబాబు



శ్రీశైలం/ఆత్మకూరు, జూలై 29: ద్వాదశ జ్యోతిర్లింగమైన శ్రీశైలం క్షేత్రానికి ఆగస్టు ఒకటో తేదీన సీఎం నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేశారు. ముందుగా ఉదయం 10:30 సున్నిపెంటకు హెలీకాప్టర్ ద్వారా చేరుకుని అనతరం శ్రీశైలం క్షేత్రానికి రోడ్డుమార్గాన వెళ్తారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని శ్రీశైలం ప్రాజెక్ట్‌ను సందర్శించి నదీజలాలకు గంగ హారతి ఇస్తారు. తర్వాత ఏపీజెన్కో అధికారులతో సమావేశమై విద్యుదుత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తారు. అనంతరం సున్నిపెంట ప్రజావేదికకు చేరుకుని అక్కడ సాగునీటి రైతులు, అధికారులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటలకు సున్నిపెంట నుంచి శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి చంద్రబాబు వెళ్తారు. కాగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో అదే రోజు అక్కడ జిల్లా ముఖ్య నాయకులతో చర్చించే అవకాశం ఉంది.

వరద జలాలను వినియోగించుకోండి

● సాగు నీటి ప్రాజెక్టులన్నింటినీ తక్షణమే నింపండి
● తక్షణ మరమ్మతుల నిధుల కోసం ప్రతిపాదనలు ఇవ్వండి: మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న మంత్రులు, నంద్యాల, కడప జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్ రాజకుమారి, జేసీలు విష్ణుచరణ్. అధితిసింగ్

నంద్యాల (కల్చరల్), జూలై 29: కృష్ణా, తుంగభద్ర నదుల వరద జలాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డిలు జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులతోపాటు, డోన్, పాణ్యం, ఆత్మకూరు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి, గౌరు చరిత, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్త జయసూర్య, కడప జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, కడప జేసీ అధితిసింగ్, నంద్యాల సాగు నీటి సంఘాల నాయకులు, రైతులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ శ్రీశైల జలాశయం వెనుక జలాలను వినియోగించుకునేందుకు తెలుగుగంగ, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, హెచ్ఎన్ఎస్ఎస్ తదితర ప్రాజెక్టుల మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయింపునకు ప్రతిపాదనలు ఇవ్వాలని అన్నారు. నదుల అనుసంధానం ద్వారా ప్రతిఎకరాకు నీళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్

కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా అన్ని రిజర్వాయర్లను నింపేందుకు సంబంధిత అధికారులతో పర్యవేక్షిస్తానన్నారు. డోన్ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వరద జలాలను వృథా చేయకుండా డ్రాచేసి అన్ని ప్రాజెక్టులు నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యేల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సిద్దాపురం, శివభాష్యం, బానకచెర్ల నుంచి కాలువల ద్వారా వెళ్లే ప్రవాహాల తూములు, స్లూయిస్‌ల మరమ్మతులకు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ వెలగమాన్ డ్యామ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ కేసీ కెనాల్ 0 నుండి 130 కిలోమీటర్ల వరకు మరమ్మతులు చేపట్టి స్థిరీకరించిన ఆయకట్టుకు నీరు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల ఇరిగేషన్ అధికారులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో చేసిన కీలక తీర్మానాలు

1 2024-25 సంవత్సరానికి ఖరీఫ్ పంటలకుగాను తెలుగుగంగ పథకం కింద ఆగస్టు 1వ తేదీ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని వరినాట్ల కోసం నీటిని విడుదల చేయాలి.

2. ఎస్సార్బీసీ కాలువ ద్వారా ఆగస్టు 1 నుంచి లక్షా 13 వేల ఎకరాలకు నీరు ఇవ్వాలి

3. కేసీ కాలు కింద 1,75,388 ఎకరాలకు నీరు ఇవ్వాలి

4. శివభాష్యం ప్రాజెక్టు కింద ఎనిమిది వేల ఎకరాలకు ప్రాజెక్టులలో నీరు చేరిన వెంటనే విడుదల చేయాలి.

5. కృష్ణా యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

6. తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించాలి.

పీజీఆర్ఎస్‌కు 110 ఫిర్యాదులు

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 29 : నంద్యాల బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు 110 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదారులతో ఎస్పీ నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితుల సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, ఫిర్యాదులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో మనస్పర్థలు తదితరాలు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. తమ ఇంటికి వెళ్లే దారిలో బండలు అడ్డంపెట్టి, గోడకట్టి రాకపోకలు సాగించకుండా సుబ్రమణ్యం, ప్రతాప్, రాజశేఖర్, శ్రీనివాసులు, శివయ్య, శంకర్ వారి కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారని శిరివెళ్ల గ్రామానికి చెందిన బి.సంటెన్న అనే వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నంద్యాల పట్టణంలోని అయ్యలూరుకు చెందిన మీరా దినేష్‌రెడ్డి తన కారును శివరామి అనే వ్యక్తి తీసుకెళ్లి 30 రోజులవుతున్నా తనకు ఇవ్వలేదని ఫిర్యాదు చేశాడు. శిరివెళ్ల గ్రామానికి చెందిన కరిష్మా 2020లో ఆకుమళ్ల అబిద్‌తో తనకు వివాహమైందని, తమకు ఇద్దరు ఆడపిల్లలు సంతానమని, కొంతకాలంగా భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

మోసం చేయడానికి మేమే దొరికామా..?

సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఆదోని రూరల్ జూలై 29 : 'మోసం చేయడానికి మేమే దొరికామా.. మమ్మల్ని మోసం చేయడానిక మనస్సు ఎలా వచ్చింది.. పెట్టుబడి రాయితీని ప్రభుత్వం మాకు వేస్తే వాటిని బంధువుల ఖాతాలకు బదిలీ చేసుకుంటా' అంటూ పెద్ద హరివాణం రైతులు మండిపడ్డారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 2023-24లో ప్రభుత్వం ఆదోనిని కరువు మండలంగా ప్రకటించిందని అన్నారు. పెద్దహరివాణం గ్రామానికి చెందిన 1900 మంది రైతులకు పెట్టుబడి రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయక అధికారులు వందల సంఖ్యలో రైతుల ఖాతాలను మార్చి వారి బంధువుల ఖాతాల్లో జమ చేసుకున్నారని తెలిపారు. గ్రామ రైతు, టీడీపీ జిల్లా నాయకుడు దేవేంద్రప్ప మాట్లాడుతూ ఇదే అంశంపై ఆంధ్రజ్యోతి దినపత్రిక ఈ నెల 7వ తేదీన నిండా మోసం అన్న కథనాన్ని ప్రచురితం చేసిందని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చాడు. తప్పు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు.

బంగారు నగల వ్యాపారి కిడ్నాప్ కలకలం



వెంకటేశ్వర్లు

గూడూరు, జూలై 29: కర్నూలు జిల్లాలో బంగారు నగల వ్యాపారి కిడ్నాప్ ఘటన సోమవారం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. గూడూరు మండల కేంద్రంలోని దమాం వెంకటేశ్వర్లు అలియాస్ కాశీ వెంకటేశ్వర్లు తన సోదరుడితో కలిసి బంగారు నగల వ్యాపారం చేస్తున్నాడు. దమాం వెంకటేశ్వర్లుకు ఎమ్మిగనూరు రోడ్డులో దాల్‌మిల్ దగ్గర పలు దుకాణాలు ఉన్నాయి. ఈ క్రమంలో రెండు రోజులుగా క్రితం గుర్తు తెలియని వ్యక్తులు తమకు షాపులను అద్దెకు ఇవ్వాలంటూ ఫోన్ ద్వారా సంప్రదించారు. తిరిగి సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మళ్లీ వెంకటేశ్వర్లుకు ఫోన్ కాల్ వచ్చింది. అద్దె షాపులను చూపించేందుకు బైక్‌పై ఎమ్మిగనూరు రహదారిలో ఉన్న దాల్‌మిల్ దగ్గరకు వెంకటేశ్వర్లు వెళ్లాడు. అప్పటికే అక్కడ మకాం వేసిన గుర్తు తెలియని దుండగులు క్షణాల్లో స్కార్పియో వాహనంలో చేరుకుని వెంకటేశ్వర్లును బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని పరారయ్యారు. జరిగిన సంఘటన అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కొద్దిసేపటి తర్వాత వెంకటేశ్వర్లు సోదరుడు రాజుకు కిడ్నాపర్లు ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేశారు. ఆయన హుటాహుటిన పోలీసులకు సమాచారం అందించారు. కోడుమూరు సీఐ మన్సురుద్దీన్‌తోపాటు గూడూరు, కోడుమూరు ఎస్‌ఐలు హనుమంతయ్య, బాలనరసింహులు పోలీసులతో రంగంలోకి దిగి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దమాం వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసిన గుర్తు తెలియని దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేస్తున్నారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో తెలంగాణ జడ్జి వేణుగోపాల్

శ్రీశైలం, జూలై 29: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలంగాణ రాష్ట్రం హైకోర్టు జడ్జి వేణుగోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న జడ్జి వేణుగోపాల్‌కు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. జడ్జి వేణుగోపాల్‌కు ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 29: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అన్నారు. 171 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్‌చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి శిక్ష తప్పదు

సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), జూలై 29: గత ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అండ చూసుకుని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలు సృష్టించాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మళ్లీ తామే అధికారంలోకి వస్తామన్న ధీమాతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన అనురుల దుర్మార్గాలపై బలైన బాధితులందరూ ఫిర్యాదులు చేసేందుకు బారులు తీరుతున్నారని అన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తుల కబ్జాలు చేసి పోగు చేసుకుని వాటికి సంబంధించిన రికార్డులన్నింటినీ పీఏసీ కాంత్ ఇంటికి తరలించారని, మిగిలిన ఆధారాలు కార్యాలయంలో లభ్యం కాకుండా మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో దహనం చేయించారని ఆరోపించారు. ఆయన చేసిన అరాచకాలకు పాపం పండి జైలు శిక్ష అనుభవించక తప్పదని అన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

ఏడుగురికి గాయాలు..

ఐదుగురిపై కేసు నమోదు

మంత్రాలయం, జూలై 29: మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన కురువ ఆడివప్ప, కురువ ఈరన్న అన్నదమ్ముల మధ్య పొలం విషయంలో ఘర్షణ జరిగింది. సోమవారం సూగూరు గ్రామ పరిధిలో ఉన్న 42 సెంట్ల పొలం విషయంలో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఈరన్న, భూషమ్మ, లక్ష్మి, మాజీ సర్పంచ్ పద్మావతి, కురువ నరసింహులుపై ఆడివప్ప కొడుకు గోవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపీనాథ్ తెలిపారు. ఇందులో కురువ ఈరన్న, అతని భార్య మాజీ సర్పంచ్ పద్మావతిలకు తీవ్ర గాయాలు కాగా, కర్నూలు ఆసుపత్రికి తరలించారు. గోవర్ధన్, కురువ ఆడివప్ప, అతని భార్య లక్ష్మితో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయం



ఎస్సార్బీసీకి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- ఎస్సార్బీసీ, గోరుకల్లు రిజర్వాయర్‌కు నీటి విడుదల

పాణ్యం, జూలై 29: రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. పోతిరెడ్డిపాడునుంచి విడుదలైన కృష్ణా జలాలను సోమవారం, ఎస్సార్బీసీ, గోరుకల్లు రిజర్వాయర్‌కు ఆమె విడుదల చేశారు. బైపాస్ రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గేట్లు ఎత్తి ఎస్సార్బీసీకి వెయ్యి కూసెక్కులు, గోరుకల్లు రిజర్వాయర్‌కు 5 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ రెండు నెలలుగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో రిజర్వాయర్లకు వరద పోటెత్తుతోందన్నారు. తుంగభద్ర, శ్రీశైలం రిజర్వాయర్లకు సంపూర్ణంగా నీరు వచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గోరుకల్లు రిజర్వాయర్‌లో కుంగిన రాతిపరుపు మరమ్మతు పనులను రూ.కోటి నిధులతో యుద్ధప్రాతిపదికన చేపట్టామన్నారు. ప్రస్తుతం గోరుకల్లు రిజర్వాయర్‌లో మిగిలిన పనులకు రూ.98 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. గోరుకల్లు ఈఈ శుభకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎస్సార్బీసీ కింద పొలాలకు వెయ్యి క్యూసెక్కులు, రిజర్వాయర్‌లోకి 5 వేల క్యూసెక్కులు పంపించడం జరుగుతుందన్నారు. క్రమక్రమంగా 9 వేల క్యూసెక్కులకు పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు అశ్వత్థనారాయణ, శివప్రసాద్, శ్రీదేవి, రాధాకృష్ణ, అమృతసాగర్, రామ్మోహన్, ఎంపీటీసీ రంగ రమేష్, మాజీ జెడ్పీటీసీ నారాయణమ్మ, టీడీపీ నాయకులు జయ రామిరెడ్డి, రమణమూర్తి, రామ్మోహన్‌నాయుడు, రాంపుల్లారెడ్డి, రామ గోవిందరెడ్డి, అమరసింహారెడ్డి, శివశంకరరెడ్డి, ఖాదర్‌బాషా, బాల సుబ్బయ్య, నంద్యాల రవి, సురేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లాకు 4,129 మెట్రిక్ టన్నుల ఎరువులు



పరిశీలిస్తున్న డీఏవో, తదితరులు

నంద్యాల టౌన్, జూలై 29: జిల్లాకు వివిధ ఎరువుల కంపెనీల నుంచి 4,129 మెట్రిక్‌టన్నుల ఎరువులు వచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ, రేక్ ఆఫీసర్ ప్రసాదరావు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం నంద్యాల రైల్వే స్టేషన్‌కు ఎరువుల వ్యాగన్లు వచ్చాయి. క్రిబ్‌కో, ఫ్యాక్ట్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు ఇచ్చిన సమాచారం మేరకు అధికారులు ఎరువులను పరిశీలించారు. క్రిబ్‌కో నుంచి 1,150 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,650 మెట్రిక్ టన్నుల 10:26:26, ఫ్యాక్ట్ కంపెనీకి చెందిన 1,329 టన్నుల 20:20:20 ఎరువులను దిగుమతి అయ్యాయి. ఇందులో మార్క్‌ఫెడ్‌కు 575 మెట్రిక్ టన్నుల డీఏపీని కేటాయించడం జరిగిందని డీఏవో మురళీకృష్ణ తెలిపారు. వచ్చిన ఎరువులలో ప్రైవేటు డీలర్లకు, మార్క్‌ఫెడ్‌లకు, పీఏసీఎస్‌లకు అవసరాలకు అనుగుణంగా కేటాయించడం జరుగుతుందన్నారు.

జిల్లాకు 1.70 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం

నంద్యాల జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లలో 2.36 లక్షల హెక్టార్లల్లో వివిధ పంటల సాధారణ విస్తీర్ణం కాగా ఇందు కోసం 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ తెలిపారు. ప్రస్తుతం 91,704 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల అవసరం, వినియోగాన్ని బట్టి ప్రతి నెల ఎరువులను జిల్లాకు తెప్పిస్తామన్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేదన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పైసా వసూల్

రీ సర్వే పేరిట సర్వేయర్ల దందా



హొళగుంద, జూలై 29: గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే సర్వేయర్ల పాలిట కాసుల వర్షం కురిపించింది. హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో ఆరు నెలల క్రితం 6,393 ఎకరాల్లో రీసర్వే చేపట్టారు. ఇందులో భాగంగా పొలాలు సర్వే చేయగా వివాదాలు, భూముల విస్తీర్ణంలో భారీ వ్యత్యాసాలు చోటు చేసుకుంటున్నాయి. ఎక్కువ విస్తీర్ణంలో భూములు ఉన్న వారికి తక్కువగా ఉన్నట్లు రికార్డులో నమోదు చేశారు. ఒరిజినల్ ఆర్ఎస్ఆర్‌కు, రీ సర్వే రికార్డుకు పొంతన లేకపోవడంతో రైతులు సరిచేయాలని కోరారు. దీంతో అధికారులు ఆ గ్రామానికి చెందిన ఓ దళారిని పెట్టుకొని బేరసారాలకు దిగినట్లు తెలిపారు. దీంతో చేసేదిలేక రైతులు అధికారులు అడిగిన లక్షల రూపాయలు ఇచ్చుకున్నట్టు తెలుస్తోంది. డబ్బులు ముట్టజెప్పి నెలలు కావస్తున్నా ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు కాకపోవడంతోపాటు, కూటమి ప్రభుత్వం భూ రీసర్వేను రద్దు చేయడంతో రైతులు లబోదిబో అంటున్నారు. డబ్బులు ఇచ్చిన రైతులు సంబంధిత అధికారులను, దళారి ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ఏఎం ప్రసాద్ రాజును వివరణ కోరాగా రీసర్వేలో పాల్గొన్న సర్వేయర్లతో మాట్లాడతానని అన్నారు. రైతుల వద్ద డబ్బులు తీసుకున్నట్లయితే రైతులకు తిరిగి ఇప్పిస్తామని చెప్పారు.

రూ.63 వేలు తీసుకొని పని చేయలేదు



తొమ్మిది మంది మా అన్నదమ్ములకు సర్వే నెంబర్ 223/ఐలో 6.31 సెంట్లు పొలం ఉంది. ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా చూపుతోంది. ఒక్కొక్కరికి 0.70 సెంట్ల పొలం వస్తుంది. రీ సర్వేలో మా పేర్లు ఆన్‌లైన్‌లో వచ్చేలా చేస్తామని సచివాలయం సర్వేయర్లు డబ్బులు తీసుకొని ఇప్పుడు ఫోన్ చేస్తే స్పందించడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. నాతోపాటు మా గ్రామంలో చాలా మంది డబ్బులు ఇచ్చారు. అందరం మోసపోయాం. ఎలాగైనా డబ్బులు ఇప్పించాలని కోరుతున్నాం.

- మాకన్న రైతు, గజ్జెహళ్లి గ్రామం

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టిన పోలీసులు



బాల దస్తగిరి (ఫైల్)

కోవెలకుంట్ల, జూలై 29 : చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి గల్లంతైన సంఘటన కోవెలకుంట్లలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వర ప్రసాద్ వివరాల మేరకు.. కోవెలకుంట్ల మండల పరిధిలోని అమడాల గ్రామానికి చెందిన బాల దస్తగిరి (45) ఆదివారం చేపలు పట్టేందుకు కోవెలకుంట్ల నుంచి గుంజలపాడు వెళ్లే రహదారిలో రైల్వే వంతెన సమీపంలో ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లి గల్లంతయ్యాడు. బాల దస్తగిరి తిరిగి ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు కుంట వద్దకు వెళ్లి విచారించగా బాలదస్తగిరికి చెందిన దుస్తులు, చెప్పులు, వల అక్కడే ఉన్నాయి. దీంతో కుంటలో పడి గల్లంతైనట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించి బాలదస్తగిరిని వెలికి తీసేందుకు గజ ఈతగాళ్లను పిలిపించారు. సాయంత్రం వరకు వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. 24గంటలు గడిస్తే తప్ప బాల దస్తగిరి ఆచూకీ లభ్యంకాదని పోలీసులు అంటున్నారు. రైల్వే కట్ట నిర్మాణ పనులు జరిగేటప్పుడు సమీపంలోని పొలంలో మట్టిని తవ్వగా పెద్దకుంటగా ఏర్పడింది. ఈ కుంటలో నీళ్లు ఉండడంతో స్థానికులు చేపలను వదిలి పెంచుకుంటున్నట్లు సమాచారం. అందుకోసం కుంటలో వలలు వేసి ఉండవచ్చని పలువురు చర్చించుకుంటున్నారు. బాలదస్తగిరి కుంటలో పడి వలలో చిక్కుకుని ఉండవచ్చని బంధువులు భావిస్తున్నారు.

పొలం గట్టు విషయంలో ఘర్షణ

- ఒకరి మృతి
- 8మందిపై కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 29: ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో పొలంగట్టు విషయంలో దాయాదుల మధ్య ఘర్షణ జరిగి కామయ్య(52)అనే రైతు మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ కామయ్యకు ఎస్.నాగలాపురం రోడ్డులో 2.70 ఎకరాల పొలం ఉంది. అతని దాయాదులకు చెందిన గోపాల్, నారాయణలకు కూడా భూమి ఉంది. ఇరువురి మధ్య కొంతకాలంగా పొలంగట్టు విషయంలో వివాదం నడుస్తోంది. సోమవారం పొలం దగ్గరకు కామయ్య అతని కుమారుడు పెద్దయ్యలు వెళ్లారు. పొలంలో గట్టు దగ్గర రాళ్లను సరిచేస్తుండగా పక్క పొలానికి చెందిన గోపాల్, వీరేష్, రామకృష్ణ, నారాయణలతోపాటు మరికొంతమంది కామయ్యతో వాగ్వాదానికి దిగారు. వాగ్వాదం కాస్తా ఘర్షణకు దారితీసింది. ఒక్కసారిగా బోయ కామయ్యపై గడ్డపార, చలికెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో కామయ్య కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు కామయ్యను ఎమ్మిగనూరుకు తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కర్నూలు రెఫర్ చేశారు. అంబులెన్స్‌లో కర్నూలుకు తీసుకెళ్తుండగా ఆస్పత్రికి చేరుకోగానే మృతి చెందాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. కాగా సమాచారం అందుకున్న ఎమ్మిగనూరు ఇన్‌చార్జీ డీఎస్పీ శివనారాయణస్వామి, రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కామయ్య కుమారులు, భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన గోపాల్, వీరేష్, రామకృష్ణ, ఉరుకుందమ్మ, కామయ్య, మహదేవ, నాగిరెడ్డి, నారాయణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య లింగమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు



మఠం హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మంత్రాలయం, జూలై 29: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,69,35,189 వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు తెలిపారు. సోమవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురురాజా సభా ప్రాంగణ భవనంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య జూలైకి సంబంధించిన 32 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. నగదుతోపాటు 075.200 మి.గ్రా. బంగారం, కేజీ 900 గ్రాముల వెండి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వీటితో పాటు వివిధ దేశాల డాలర్లు కూడా వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, దత్తుస్వామి, కృష్ణమూర్తి, అనంతపురాణిక్, సుజ్ఞానేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

దేవనకొండ, జూలై 29 : దేవనకొండ మూగితాత కొట్టాలకు చెందిన పెద్ద దస్తగిరి మూడు రోజులుగా కనిపించడం లేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ శ్రీనివాసులు దస్తగిరి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూల్‌డ్రింక్ షాపులో దొంగతనం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 29 : పట్టణంలోని ఆదోని హైవే రోడ్డులో గల ఆర్‌జీవీ రెస్టారెంట్ ఎదురుగా హరిణీ కూల్‌డ్రింక్ షాపులో దొంగలు పడ్డారు. మల్కాపురానికి చెందిన జి.గోపినాథ్ ఆదోని హైవే రోడ్డులో హరిణీ కూల్‌డ్రింక్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి యథావిధిగా షాపునకు తాళం వేసి వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి షాపు చూసే సరికి షాపు పక్కన రంధ్రం పెట్టింది చూసి షాక్ గురయ్యాడు. షాపులోని కూల్‌డ్రింక్స్ బాక్సులు, సిగరెట్లు, ఒక సిలిండర్, రూ. 2 వేల నగదు దోచుకెళ్లారు. సంఘటన గురించి బాధితుడు పోలీసులకు తెలపగా ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

గోనెగండ్లలో అనుమానిత డెంగీ కేసు



నిలువ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

గోనెగండ్ల, జూలై 29: మండల కేంద్రంలోని మూడో సచివాలయం పరిధిలో సోమవారం ఒకటి అనుమానిత డెంగీ కేసు నమోదు కావడంతో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఆ పరిసర ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి లార్వా, నీరు నిలువ ఉన్న డ్రమ్ములను, గచ్చులను పరిశీలించారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేశారు. డెంగీ సోకినట్లు అనుమానం ఉన్న కుంటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వారి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. వైరల్ ఫీవర్‌గా నిర్ధారణకు వచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సూపర్‌వైజర్ హనుమంతు, సుధాకర్, ఏఎన్ఎం ప్రమీల, మాధవి పాల్గొన్నారు.

సర్పంచుపై తలారి అత్యాచార యత్నం

తప్పించుకొని గ్రామానికి చేరుకున్న బాధితురాలు

ఆదోని రూరల్, జూలై 29 : ఆదోని మండలం పెద్ద పెండేకల్లు గ్రామానికి చెందిన ఉప్పర జయమ్మపై అదే గ్రామ తలారి నరసింహులు అత్యాచార యత్నం చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. సర్పంచు జయమ్మ ఆదివారం ఉదయం శిరుగుప్పకు వెళ్లింది. సాయంత్రానికి గ్రామానికి వెళ్లే క్రమంలో ఆరేకల్లు క్రాస్ వద్ద ఆటో కోసం ఎదురు చూస్తోంది. ఆ సమయంలోనే గ్రామ తలారి నరసింహులు వచ్చి తన బైక్‌పై ఎక్కితే వదిలిపెడతానని చెప్పాడు. దీంతో జయమ్మ బైక్‌పై ఎక్కింది. తలారి కొండల్లోకి తీసుకెళ్తుండగా జయమ్మకు అనుమానం వచ్చి బైక్‌పై నుంచి దూకేసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తోపులాట జరిగి జయమ్మ గాయాలపాలైంది. తలారి నరసింహులు నుంచి తప్పించుకొని రెండు కి.మీ., నడుచుకొంటూ గ్రామానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు నరసింహులు ఆచూకీ తెలుసుకొని దాడి చేశారు. అనంతరం సదరు మహిళ తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తలారి నరసింహులుపై అత్యాచార యత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

ఆస్తి కోసం అన్న హత్య

మృతదేహాన్ని బైక్‌పై తెచ్చి పడేసిపోయిన సోదరులు

సి.బెళగల్, జూలై 29: ఆస్తి తగాదాలతో తెలంగాణలో సొంత అన్న హతమార్చిన సోదరులు మృతదేహాన్ని తెచ్చి సరిహద్దున ఉన్న సి.బెళగల్ మండలంలో పడేశారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్దదన్వాడ గ్రామానికి చెందిన గోకారి కుమారుడు శేషిరెడ్డి(55)ని అతడి సోదరులు నాగిరెడ్డి, మహేశ్‌లు హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై ఆంధ్ర సరిహద్దులోని సి.బెళగల్ మండలంలోని కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పడేశారు. విషయం తెలుసుకున్న కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐలు తిమ్మారెడ్డి, బాలనరసింహుడు, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు సంతానం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

ఎస్పీని కలిసిన శ్రీశైలం ఎమ్మెల్యే


ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను కలిసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జూలై 29: నంద్యాల ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అధిరాజ్ సింగ్ రాణాను సోమవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయానికి స్వయంగా వెళ్లి ఆయన్ని పలకరించారు. అదేవిధంగా శ్రీశైల నియోజకవర్గంలో శాంతిభద్రతలపై వారు చర్చించారు.

వైభవంగా వెండి రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

శ్రీశైలం, జూలై 29: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జునస్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛ రణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహిం చారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళ హారతులు ఇచ్చి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహానందిలో పల్లకీ ఉత్సవం


పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, జూలై 29: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీలో మహానందీశ్వరుడి ఊరేగింపు నిర్వహించారు. మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను వేదపండితులు, అర్చకులు కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన పల్లకీలో ఆశీనులు గావించారు. అనంతరం వేదపండితులు రవిశంకర్ అవధాని, శాంతారాం భట్, హనుమంత్ శర్మ ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ సేవ ఉత్సవాన్ని మేళతాళాలతో నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'రైతులను ఆదుకోవాలి'

జూపాడుబంగ్లా, జూలై 29: జూపాడుబంగ్లా-1, 2 ఎత్తిపోతల పథకాల మోటార్లు మరమ్మతులకు గురికావడంతో రైతులు పంటలను సాగు చేసుకోలేదని, తక్షణమే మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని సోమవారం నంద్యాలలో కలెక్టర్ రాజకుమారిని కలిసి రైతులు వినతిపత్రం అందజేశారు. జూపాడుబంగ్లా ఎత్తిపోతల పంప్‌హౌస్‌లోనే 5 మోటర్లు మరమ్మతులకు గురయ్యాయని, రూ. 45లక్షలు ఖర్చు అవుతాయని అధికారులు చెబుతున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ఎత్తిపోతల ఎత్తిపోతల చైర్మన్ గిరీశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమణారెడ్డి, రమ్మోహన్‌రెడ్డి, పెద్దన్న, రవికుమార్‌యాదవ్, మల్లయ్య, కృష్ణ, హుసేన్‌బాషా, తంగడంచ, జూపాడు బంగ్లా, పారుమంచాల, మండ్లెం, తర్తూరు రైతులు పాల్గొన్నారు.

'లింగనిర్ధారణ చేస్తే చర్యలు'

ఆత్మకూరు, జూలై 29: లింగనిర్ధారణ, భ్రూణహత్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంతారావునాయక్, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సబ్ డివిజనల్ మల్టీ మెంటర్ అప్రాప్రియేట్ అథారిటీ, సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వయిజరీ కమిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏపీపీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాలికలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అనే విషయాలను తెలియజేయాలని అన్నారు. సమావేశంలో పీసీపీఎన్‌డీ ఆర్గనైజర్ మద్దిలేటి, ఎన్‌జీవో ప్రతినిధి జుల్ఫీకర్ అలీఖాన్ తదితరులు ఉన్నారు.

ప్రొద్దుటూరు ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, జూలై 29: కడప జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎన్.వరదరాజులురెడ్డిని సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో రైతు నాయకులు సన్మానించారు. సోమవారం జరిగిన జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశానికి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే హాజరయ్యారు. సమావేశం అనంతరం మర్యాదపూర్వకంగా సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి ఇంటికి వరదరాజులు రెడ్డి వచ్చారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, ఎగువ నుంచి వస్తున్న వరద, పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల, తెలుగుగంగ, గోరుకల్లు, కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టులకు నీటి విడుదల, తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి, ఏర్వా రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

ఆత్మకూరురూరల్, జూలై 29: ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటాపురం గ్రామంలోని శివాలయంలో ఆదివారం రాత్రి ఆలయపురోహితులు పూజాది కార్యక్రమాలు ముగించుకుని గుడికి తాళాలు వేసి వెళ్లిపోయారు. కాగా గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలయం గేటుకు ఉన్న తాళాలు పగుల గొట్టి ఆలయంలోకి చొరబడి గుడిలోని రెండు హుండీలను పగులగొట్టి హుండీలో ఉన్న సుమారు రూ.30 వేల నగదును అపహరించుకుని వెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం గుడి తాళాలు తెరిచి ఉండటాన్ని గమనించి గుడిలో ఎవరో చోరీకి పాల్పడ్డారని తెలుసుకుని ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించినట్లు గ్రామస్థులు తెలిపారు. సీఐ లక్ష్మీనారాయణ క్లూస్ టీంతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంఘటన వివరాలను సీఐ గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం: మంత్రి

నంద్యాల (నూనెపల్లె), జూలై 29: ప్రజా సమస్యలను పరిష్కరించడమే టీడీపీ ధ్యేయమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం ఆయన టీడీపీ కార్యాలయంలో మన ఊరు మన బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు నేరుగా మంత్రి ఫరూక్‌ను కలిసి వినతులు అందజేశారు. సంబంధి త సమస్యపై అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు.

'త్వరితగతిన నిర్మించాలి'

ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం భవన సముదాయాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆల్‌మేవా జిల్లా గౌరవాధ్యక్షుడు అబులైస్, జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్ పాష కోరారు. నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమం, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఆల్‌మేవా నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. సైఫుల్లా, అస్మద్దీన్, అమ్జాద్‌బాషా, సిద్ధికి, మునీర్ అమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నంద్యాలలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల జంప్‌రోప్ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలుగా నిలిచిన జట్లకు ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం గౌరవ సలహాదారుడు సుధాకర్, క్రీడాభారతి రాయలసీమ జోనల్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ విద్యా సంస్థల చైర్మన్ సుధాకర్, చలంబాబు, రాష్ట్ర జంప్‌రోప్ చైర్మన్ రాజా, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రమణ, సుబ్బయ్య పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన జట్లకు మెడల్స్, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. మంత్రి ఫరూక్‌ను సన్మానించారు. మొదటి స్థానంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా, రెండో స్థానంలో కడప జిల్లా, మూడో స్థానంలో కర్నూలు ఇలాల గెలిచాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి చిత్తూరు జిల్లా కైవసం చేసుకుంది. కార్యక్రమంలో జంప్‌రోప్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్, పక్కీరయ్య తదితరులు పాల్గొన్నారు.


జంప్‌రోప్ విజేతలకు మెడల్స్, మెమెంటోలు అందజేస్తున్న మంత్రి

హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని ఉపేక్షించం: ఎమ్మెల్యే

పాణ్యం, జూలై 29: ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని ఉపేక్షించేది లేదని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బలపనూరు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం నారాయణపై జరిగిన దాడిపై పాఠశాల హెచ్‌ఎంతో చర్చించారు. దీనిపై హెచ్‌ఎం మాట్లాడుతూ నెల 27వ తేదీన పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల ప్రహరీని కూల్చడంతో మందలించినట్లు హెచ్‌ఎం తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన విద్యార్థి తండ్రి రెడ్డిపోగుల వెంకటేశ్వర్లు సోమవారం గొడ్డలి కామాతో దాడి చేసినట్లు తెలిపారు. దీంతో అక్కడే ఉన్న పాఠశాల సిబ్బంది వెంకటేశ్వర్లును పంపించివేశారన్నారు. అనంతరం పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ హెచ్‌ఎంపై దాడి చేయడం నేరమని అన్నారు. బలపనూరు హెచ్‌ఎంపై జరిగిన దాడి పట్ల ఉపాధ్యాయ సంఘాలు మండిపడ్డాయి. సోమవారం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. హెచ్‌ఎంపై భౌతిక దాడులకు పాల్పడడం తీవ్రమైన చర్యగా మండల ఏపీయూఎస్ అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కరరెడ్డి, తొట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ నాయకులు రామపక్కిరెడ్డి, భాస్కరరెడ్డి, టీఆర్‌టీ నాయకులు మాధవరెడ్డి, నిసార్‌లు డిమాండ్ చేశారు.

కేసు నమోదు: బలపనూరు హెచ్‌ఎం నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెడ్డిపోగుల వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు పాణ్యం ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

'హెచ్‌ఎంపై దాడి అమానుషం'

నంద్యాల (నూనెపల్లె): పాణ్యం మండలంలోని బలపనూరు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నారాయణపై దాడి చేయడం అమానుషమని


హెచ్‌ఎం నారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, కార్యదర్శి మధు సూదనరావు అన్నారు. నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ప్రహరీని పగలగొట్టడంతో హెచ్‌ఎం వారిని మందలించారని, అయితే ఓ విద్యార్థి తండ్రి వెంకటేశ్వర్లు విధుల్లో ఉన్న హెచ్‌ఎంను గొడ్డలి కర్రతో దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ సభ్యులు శివుడు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవ స్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● బలపనూరు జడ్పీహెచ్ఎస్‌లో హెచ్‌ఎంపై ఓ విద్యార్థి తండ్రి దాడి చేయడం సరికాదని, అతడిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్(257) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మౌలాలి, అజాంబేగ్, ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌లు ఖండించారు.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నాయకులు


కలెక్టర్ రాజకుమారిని కలిసిన ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర

నందికొట్కూరు, జూలై 29: నంద్యాలలోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం కలెక్టర్ రాజకుమారిని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నంద్యాల ఎస్పీ కార్యాలయంలో ఆయనను మాండ్ర శివానందరెడ్డితో పాటు టీడీపీ నాయకులు నారపురెడ్డి, ఖాతా రమేష్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, జమీల్, మద్దిలేటి తదితరులు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మాండ్ర ఎస్పీని కోరినట్లు తెలిపారు.


ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

'పెద్దపులుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ'

ఆత్మకూరు, జూలై 29: పెద్దపులుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఆత్మకూరు, బైర్లూటి, వెలుగోడు రేంజర్లు ఎం.పట్టాభి, పీ.సుభాష్, ఖాన్‌లు అన్నారు. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు మండలంలోని బైర్లూటి ఏకోటూరిజం నందు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో పెద్దపులుల ప్రాముఖ్యత గురించి దానంపై వీడియో ప్రదర్శన ద్వారా వివరించారు. వారు మాట్లాడుతూ.. ఎక్కడైతే పులుల సంరక్షణ సజావుగా సాగుతుందో ఆ ప్రాంతం పర్యావరణ హితంగా ఉంటుందని వివరించారు. అందుకే పర్యావరణ సూచికలో పెద్దపులే అగ్రభాగన నిలుస్తోందని అన్నారు. పులులకు వున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రపంచ వ్యాప్తంగా పులుల సంరక్షణకు ఆయా దేశాలు ఎంతో కృషిచేస్తున్నాయని వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను జరపడంతో పాటు ఇటీవల నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. డీఆర్‌వోలు, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు తదితరులు ఉన్నారు.

మహానంది పర్యావరణ సమతుల్యతతో పెద్ద పులులు కీలకపాత్ర పోషిస్తాయని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాణా ప్రతాప్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం పురస్కరించుకొని మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని ఏపి మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, టైగర్ సొసైటీ ప్రతినిధులు, ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆత్మకూరు రేంజ్ అధికారి పట్టాభి

ముగిసిన శిక్ష సప్తాహ్

బండిఆత్మకూరు, జూలై 29: శింగవరం హైస్కూల్ శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగిసింది. గత వారం రోజులుగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి శిక్షా సప్తాహ్ నిర్వహించారు. పాఠశాలలో పిచ్చి మొక్కల తొలగింపు, మొక్కలు నాటించటం, విద్యార్థులకు పర్యావరణం, భూతాపం, కలుషిత వాతావరణం పట్ల అవగహన కల్పించారు. సోమవారం హెచ్‌ఎం దస్తగిరి ఆధ్వర్యంలో చివరగా విద్యార్థులకు, తల్లి దండ్రులకు సహపంక్తి భోజనాలు నిర్వహించారు. సర్పంచ్ రాణి, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు నబీరసూల్, కలాం, ధనుంజయగౌడ్, మణికంఠ, మోహన్ బాబు, మల్లికార్జున, రామసుబ్బయ్య, చెన్నయ్య, రమణ, రమేష్, శంకర్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రభుత్వ విద్యా వ్యవస్థకు సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరమని బీజేపీ జాతీయ కారవర్గసభ్యురాలు మోమిన్ షబాన అన్నారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని రహమత్‌నగర్‌లో గల ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తిథి భోజనంతో పాటు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలాజీనాయక్, సురేష్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం చాందబాషా, ఉపాధ్యాయులు ముబీనాపర్వీన్, యాస్మిన్, అబ్దుల్‌వహాబ్, టీడీపీ నాయకులు అలిహుసేన్, బాషా, హబీవుల్లా, ఖాజా, షర్ఫుద్దీన్, తదితరులు ఉన్నారు.

వెలుగోడు: విద్యార్థులు చదువులో రాణించాలని టీడీపీ నాయకులు సూర్యనారాయణ, అమీర్ అలీఖాన్ అన్నారు. వెలుగోడు పట్టణంలోని ఎంపీపీ స్పెషల్ పాఠశాలలో సోమవారం శుభదిన్ భోజనంలో భాగంగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జాతీయ విద్యా విధానం అమలై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని టీడీపీ నాయకులు శివనాగిరెడ్డి అన్నారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు అరటి పండ్లను పంపిణీ చేశారు. ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం శైలజ, టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని వివిధ పాఠశాలలోని విద్యార్థులకు దాతల సహకారంతో తిథి బోజన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీతాబరరెడ్డి సహకారంతో విద్యార్థులకు ఎఈవో సుబాన్, హెచ్‌ఎం మధుసూదన్ రావు స్వీట్లు అందజేశారు. అలాగే ప్రాతకోట గ్రామంలోని జడ్పీ పాఠశాలలో సర్పంచ్ శేషమ్మ విద్యార్థులకు స్వీట్లు అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పగిడ్యాల, జూలై 29: మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన అచ్చన్న (79) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ముచ్చుమర్రి ఎస్ఐ గంగయ్య తెలిపిన వివరాలివీ.. అచ్చన్న ఈ నెల 21 తెల్లవారుజామున బీడి వెలుగించుకొని అగ్గిపుల్లను పారవేశారు. ప్రమాదవశాత్తు అగ్గి పుల్ల బెడ్‌షీట్‌కు తగలడంతో మంటలు వ్యాపించడంతో గాయపడ్డారు. ఆయనను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆదివారం రాత్రి మృతి చెందారు. అచ్చన్న కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'పంట సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి'

నందికొట్కూరు రూరల్, జూలై 29: ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షపాతం, తేమల నుంచి పంటలను రక్షించుకోవడానికి చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా ప్రాంతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. నందికొట్కూరు మండలంలోని అల్లూరు, శాతనకోటల గ్రామాలలోని మొక్కజొన్న, కంది, సోయాబీన్, ప్రత్తి, కొర్ర, ఉల్లి పంటలను శాస్త్రవేత్తల బృందం, నందికొట్కూరు వ్యవసాయ సంచాలకులు విజయశేఖర్, ఏవో షేక్షావలి ఆధ్వర్యంలో పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వాడకం తగ్గించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు శివరామకృష్ణ (ఎంటమాలజీ), నీలిమ, రవిప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

మిడుతూరు: నంద్యాల శాస్త్రవేత్తలు నీలిమ, శివరామకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు విజయశేఖర్ పత్తి పంటను సోమవారం మిడుతూరులో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంటను రసం పీల్చు పెరుగులైన పచ్చ దోమ, తామర పురుగులు అదేవిధంగా వేరుకుళ్లు తెగులు ఆశించి పంటకు నష్టం కలుగ చేస్తున్నట్లు వారు తెలిపారు. వ్యవసాయాధికారి పీరునాయక్, వ్యవసాయ సిబ్బంది పాలొన్నారు.

పగిడ్యాల: మొక్కజొన్న పైరుకు ఆశించే కత్తెర పురుగు నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేతలు డాక్టర్ ఎస్.నీలిమ, పి. పుల్లిబాయ్ సూచించారు. మండల పరిధిలోని పగిడ్యాలలో రైతులు సాగు చేసిన ఎస్ఎంహెచ్-777మొక్కజొన్న, ఆశా రకం కంది పంటలను వారు పరిశీలించారు. శాస్త్రవేత్తలు రవిప్రకాష్‌రెడ్డి, శివరామకృష్ణ, వ్యవసాయాధికారి జ్యోత్ కుమార్ తదితరులు ఉన్నారు.


శాతనకోటలో సోయాబీన్ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ శబరి


కేంద్ర మంత్రి అమిత్‌షాతో చర్చిస్తున్న నంద్యాల ఎంపీ శబరి

నంద్యాల (నూనెపల్లె), జూలై 29: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని సమస్యల పరిష్కారంపై ఆమె చర్చించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో ఆమె భేటీ అయ్యారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని సమస్యలను అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. నంద్యాల పార్లమెంట్ సమగ్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే కేంద్ర స్కిల్ డెవల్‌మెంట్‌శాఖ మంత్రి జయంత్ చౌదరి, సింగరేణి బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రులతో బైరెడ్డి శబరి విడివిడిగా సమావేశమయ్యారు. ఏపీలోని సమస్యలను పరిష్కరించాలని రాయల సీమలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలో బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షనా కేంద్రాన్ని నంద్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పదించినట్లు ఎంపీ బైరెడ్డి శబరి తెలిపారు.

రాష్ట్ర క్రీడాకారులకు కలెక్టర్ శుభాకాంక్షలు



సెల్ఫీ స్టాండులో కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 29: ప్యారిస్ ఒలింపియాడ్స్ 2024లో ఏపీ రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించాలని కలెక్టర్ రాజకుమారి శుభాకాంక్షలు తెలిపారు. ఫ్రాన్స్ దేశంలోని పారిస్‌లో ఈనెల 26 నుంచి ఆగస్టు 11 వరకు ప్యారిస్లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో పాల్గొననున్న 117 మంది భారత జట్టు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు కలెక్టర్ ప్రాంగణంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సెల్ఫీ స్టాండులో కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీఆర్వో పద్మజ, జిల్లా అధికారులు చీర్ ఫర్ భారత్ అనే సంకేతాన్ని చూపుతూ సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, శిక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పింఛన్ పంపిణీలో నిర్లక్ష్యం వీడాలి'

నంద్యాల (కల్చరల్), జూలై 29: వచ్చే నెల 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీపై క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యాన్ని విడనాడి ఉదయం 6గంటలకే లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేయాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 1 వతేదీన సచివాలయ సిబ్బంది సంబంధిత కార్యాలయాల్లో హాజరై క్షేత్రస్థాయిలో ఉదయం 6గంటలకు పింఛన్ దారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశిం చారు.

జలాశయాలకు జలకళ

వెలుగోడు, జూలై 29: తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయానికి రోజురోజుకు ఇన్ ఫ్లో భారీగా పెరుగుతోంది. సోమవారం సుమారు 9000 క్యూసెక్కులను చేరుకుంది. ఎగువన కురిసిన భారీ వర్షాలకు అల్మట్టి, తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు పూర్తి స్థాయిలో నిండిపోవడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు పోతిరెడ్డి పాడు నుంచి నీటిని దిగవకు విడుదల చేశారు. ఈ నీరు బానక చెర్ల సముదాయం నుంచి వెలుగోడు జలాశయానికి చేరుకుంటుంది. జలాశయ పూర్తిసామర్థ్యం 16.95 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం జలాశయంలో 2.136 టీఎంసీలకు చేరుకుందని తెలుగుగంగ ఏఈ శివనాయక్ తెలిపారు.

బండిఆత్మకూరు: ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణమ్మ పరుగులిడిగా, దిగువన ఉన్న ప్రాజెక్టులన్నీ జలకళ సంతరించుకున్నాయి. శ్రీశైలం బ్యాక్ వాటర్ పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణమ్మ పరుగులు బనకచర్ల క్రాస్ హెడ్ రెగ్యు లేటర్‌కు చేరుకుని, తద్వారా కుందూనది, కేసీ కెనాల్‌కు చేరుకున్నాయి. దీంతో కేసీ కనాల్, కుందూనది నీటి ప్రవాహాలతో జలకళ వచ్చేసింది. కర్నూలు, కడప జిల్లాల్లో కేసీ కెనాల్ సుమారు 2.50లక్షల ఎకరాలకు కేసీ సాగునీరు అందించనుంది.

'గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకోండి'

ఆత్మకూరు, జూలై 29: ఆత్మకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫాకల్టీగా పనిచేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జిష్ణు నాగ్ విజయ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీలు అవసరం ఉందన్నారు. ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు పీజీలో 55శాతం మార్కుల ఉత్తీర్ణత కలిగి ఉండాలని అన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. ఈనెల 31వ తేదిలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

రేపు వాహనాల వేలం

ఆత్మకూరు, జూలై 29: ఆత్మకూరు సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం వేలం పాటలు నిర్వహించనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు అక్కిరాజుకాలనీలో గల సెబ్ కార్యాలయం వద్ద ఉదయం 11గంటలకు వేలాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలం పాటల్లో పాల్గొనే వారు ఆధార్ కార్డు వివరాలతో రూ.1000 డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక సెబ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

1వ తేదీన..

నందికొట్కూరు, జూలై 29: ఆగస్టు 1వ తేదీన నందికొట్కూరు సెబ్ స్టేషన్ ఆవరణలో వాహనాలను వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ సీతారామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ఉదయం 11 గంటలకు నందికొట్కూరు ఎక్స్‌సైజ్ కార్యాలయం వద్ద వాహనాల వేలం ప్రారంభమవ్తుందని, వేలం పాటలో పాల్గొనే వారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించానలి ఆయన తెలిపారు. మిగిలిన వివరాలకు సెబ్ పోలీస్టేషన్‌లో సంప్రదించాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ఆలయ మండప పనులు ప్రారంభం


రాతి శిలలకు ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

మిడుతూరు, జూలై 29: మండలంలోని ఉప్పలదడియ గ్రామంలో వీరభద్ర ఆలయ మండప నిర్మాణానికి బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ముందుకు వచ్చినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ ఆలయ మండప నిర్మాణానికి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వారు తెలిపారు. ఇందులో బాగంగా సోమవారం మండపం ఏర్పాటు చేసేందుకు రాతి శిలలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గామ పెద్దలు కమతం జయరామి రెడ్డి, మహేశ్వర రెడ్డి, రాజశేఖర రెడ్డి, రామసుబ్బా రెడ్డి పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఎస్పీని కలిసిన సుబ్బారెడ్డి



ఎస్పీని సన్మానిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, జూలై 29: జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి పూల బొకే అందజేసి సుబ్బారెడ్డి సన్మానించారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు ప్రత్యేక దృష్టి సారించాలని ఈసందర్భంగా ఎస్పీని కోరారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సమర్థవంతమైన అధికారులను నియమించా రన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను టీడీపీ కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు.

'హెచ్‌ఎంపై దాడి అమానుషం'

చాగలమర్రి, జూలై 29: జిల్లాలోని బలపనూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నారాయణపై విద్యార్థి తండ్రి దాడికి పాల్పడటం తీవ్ర అమానుషమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్, ఎస్టీయూ నాయకులు అన్నారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం రోజు విద్యార్థులు పాఠశాల ప్రహరీని కూలగొట్టారని పాఠశాల హెచ్‌ఎం నారాయణ విద్యార్థులను మందలించారని, అయితే విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎంపై గొడ్డలితో దాడి చేయడం దారుణమన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా, కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మహబూబ్‌బాషా, ఎస్టీయూ సంఘ నాయకులు నారాయణ రెడ్డి, సురేషప్ప, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, శాస్త్రీ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కర్ణాటక వాసి మృతి

కొలిమిగుండ్ల, జూలై 29: మండలంలోని రామ్‌కో సిమెంటు పరిశ్రమ వద్ద అనుమానాస్పదస్థితిలో కర్ణాటక వాసి మృతి చెందిన విషాదకర సంఘటన సోమవా రం చోటు చేసుకుంది. సీఐ గోపినాథ్‌రెడ్డి తెలిపిన వివరాలమేరకు కర్ణాటక రాష్ట్రం, బాగేపల్లి నియోజకవర్గం జూల్‌పాల్య గ్రామానికి చెందిన యాతం విజకుమార్(27) సిమెంట్ లోడు కోసం లారీతో రామ్‌కో సిమెంటుకు ఆదివారం రాత్రి చేరుకున్నాడు. లారీ అక్కడే పెట్టుకొని లారీ క్యాబిన్‌లో పడుకొని నిద్రపోయాడని, సోమవారం చూడ గా మృతి చెంది పడివున్నట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీ సానుభూతిరాలి మృతి

చాగలమర్రి, జూలై 29: చాగలమర్రి గ్రామంలోని బాలికల పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న టీడీపీ సానుభూతిరాలు గోవిందమ్మ (55) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ నాయకులు గుత్తి నరసింహులు, జెట్టి నాగరాజు గోవిందమ్మ ఇంటి వద్దకు వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట జెట్టి సురేష్, గఫార్, ఫారూక్, శ్రీను, ఖాదర్, మహబూబ్‌పీరా ఉన్నారు.

మహిళపై దాడి.. ఇద్దరిపై కేసు

కోవెలకుంట్ల, జూలై 29: మహిళపై దాడి చేసిన భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలకు కొలిమిగుంట్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన రాకేశ్వరమ్మను కోవెలకుంట్ల మండలం గుళ్లదుర్తి గ్రామానికి చెందిన పుల్లయ్యకు ఇచ్చి 9 సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. వీరి దాంపత్య జీవితం కొంతకాలం సజావుగా సాగింది. అయితే కుటుంబ కలహాలతో భర్త అత్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లి కొంత కాలంగా రాకేశ్వరమ్మ అక్కడే నివాసం ఉంటుంది. సోమవారం భర్త అత్తతో పంచాయితీ చేసుకునేందుకు రాకేశ్వరమ్మ బంధువులతో కలిసి కోటపాడు నుంచి గుళ్లదుర్తికి వచ్చింది. గ్రామంలో బంధువులు పంచాయితీలో మాట్లాడుతుండగా మాట మాట పెరిగి భర్త పుల్లయ్య, అత్త కలిసి రాకేశ్వరమ్మపై దాడి చేశారు. అలాగే భర్త రాయి విసరగా రాకేశ్వరమ్మ పక్క ఉన్న దేవికి తగిలి గాయాలయ్యాయి. రాకేశ్వరమ్మ సోమవారం కోవెలకుంట్ల పోలీసుస్టేషన్‌లో భర్త, అత్తపై ఫిర్యాదు చేసిందని, వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

బేతంచెర్ల, జూలై 29: మండలంలోని నాగమల్లకుంట గ్రామానికి చెందిన దయ్యాల దశరథుడు అనే వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు గొడ్డలి, కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప సోమవారం తెలిపారు. దశరథుడు ఉదయం 6 గంటలకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా.. దారి మధ్యలో అడ్డుకుని అదే గ్రామానికి చెందిన దారం వెంకటేశ్వరరెడ్డి గొడ్డలితో నుదుటిపై కొట్టి, దెయ్యాల పాపయ్య, శంకర్‌లు కట్టెలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. గాయపడిన దశరథుడిని బేతంచెర్ల ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వోడీఎఫ్ ప్లస్ గ్రామంగా శెట్టివీడు

చాగలమర్రి, జూలై 29: మండలంలోని శెట్టివీడు గ్రామంలో వోడీఎఫ్ ప్లస్ గ్రామంగా ఎంపికైనట్లు ఆళ్లగడ్డ ఎంపీడీవో ఏవీ రమణారెడ్డి తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, సబ్ సెంటర్, శానిటరీ కాంప్లెక్స్, సాలిడ్‌వేస్ట్‌మే నేజ్ మెంట్ షెడ్లను అధికారుల బృందం పరిశీలించారు. గ్రామంలోని వ్యక్తిగత మరుగుదొడ్లను, వాటి వాడకం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక బృందంలో రుద్రవరం ఎంపీడీవో రామచంద్ర, ఈవోఆర్డీ శ్రీనివాస్ శర్మ, చాగలమర్రి ఈవోపీఆర్డీ తాహిర్ హుసేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య, స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇలియాస్, కంప్యూటర్ ఆపరేటర్ రవి పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

సంజామల, జూలై 29: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండల అధ్యక్షులు పోచా రమాదేవి ఆమోదంతో మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ ఉద్యానవన గృహ నిర్మాణ, విద్యుత్ శాఖ, సాగు నీరు, విద్యాశాఖ తదితర శాఖలపై సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. ఈసమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆపన్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

50 ఎకరాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంట

ట్రాక్టర్లతో దున్నేస్తున్న రైతులు



బ్రాహ్మణపల్లెలో మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న కౌలు రైతు

చాగలమర్రి, జూలై 29: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు. గ్రామంలోని కౌలు రైతు వెంకటన్న, రవితేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణ, దామోదర్‌రెడ్డి, మరి కొందరు రైతులు 50 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. నెల దాటినా పంట ఏపుగా పెరగక పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు రూ.12వేలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశారు. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ ప్రభావం, వర్షాభావంతో పంట ఎదుగుదల లేకపోయిందని రైతులు విలపించారు. మొక్కజొన్న మొక్కలు పెరగక పోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంట సాగు చేయడం కోసం ట్రాక్టర్లతో దున్నేశారు. మొక్కజొన్న పంట దెబ్బతిని నష్టపోయామని రైతులు వాపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

పాఠశాలలో సహపంక్తి భోజనం



రుద్రవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

రుద్రవరం, జూలై 29: రుద్రవరం ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో కలిసి ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం తిన్నారు. నూతన జాతీయ విద్యావిధానం 2020 అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిందన్నారు. ఈ నెల 18 నుంచి 29 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులతో కలిసి తిథి భోజనం చేశామని చెప్పారు.

బనగానపల్లె: మండలంలోని పాతపాడు ఎంపీపీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాతపాడు టీడీపీ సర్పంచ్ మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో శుభదిన్ భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా పట్టణంలోని మోడల్ స్కూల్‌లో శుభదిన్ భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఖాసీం బాబు, టీడీపీ నాయకులు అల్తాఫ్ హుసేన్, వార్డు సభ్యుడు అబ్దుల్ కలాం, సయ్యద్ హైదర్ పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం మండల టీడీపీ నాయకుడు బోరెడ్డి నర్సిరెడ్డి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల పథకాలకు స్ఫూర్తి దాతల పేర్లను ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. సూక్తిధి సందర్భం గా పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇష్తి కర్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: శిక్షా సప్తాహ్ కార్యక్రమం కింద జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ పోటీలు ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహించాల్సి ఉండగా.. ఆదివారం నిర్వహించాల్సిన ఆటల పోటీలను సోమవారం నిర్వహించామని వ్యాయామ ఉపాధ్యాయురాలు నాగరాణి తెలిపారు. ఈ ఆటల పోటీల్లో తొక్కుడు బిళ్ల, తాడులాగే పందెంలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ బనగానపల్లె నియో జకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. సోమవారం మండ లంలోని కనకాద్రిపల్లె ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ - శుభదిన్ కార్యక్రమంలో భాగంగా వీఆర్ లక్ష్మీరెడ్డి విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు. ఉపాధ్యాయులు వీఆర్ లక్ష్మీరెడ్డిని సన్మానించారు. అదేవిధంగా మండలంలోని 58 పాఠశాలల్లో శుభదిన్ కార్యక్రమంలో భాగంగా దాతలు విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించినట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం తెలిపారు. కల్వటాల సర్పంచ్ కామిని సుమలత, క్రిష్ణరంగారెడ్డి దంపతులు, కొలిమిగుండ్ల ఎస్సీ పాఠశాలలో మందా రమాదేవి, ఉమాదేవి, దస్తగిరమ్మ విద్యార్థులకు భోజనం ఏర్పాటుచేశారు.

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో ఎంపీపీ పాఠశాల, ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పాఠశాల స్థలదాత వడ్లమూడి చలమయ్యచౌదరి అన్నారు. ఆదివారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు అరటి పండ్లు అందజేశారు. టీడీపీ నాయకులు లింగుట్ల వెంకట్‌నాయుడు, డీలర్ రమణయ్య, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సెక్రెటరీ శ్రీనివాసులునాయుడు, లింగుట్ల అరుణ, ఉసేన్‌వలి పాల్గొన్నారు.







ఉయ్యాలవాడలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు, పాతపాడులో విద్యార్థులకు భోజనం అందిస్తున్న సర్పంచ్, కొలిమిగుండ్లలో..

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోవెలకుంట్ల, జూలై 29: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కోవెలకుంట్ల పట్టణంలోని సెయింట్‌జోసెఫ్ స్కూలుకు చెందిన విద్యా ర్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ గీత తెలి పారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సెయింట్ జోసె ఫ్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఆదివారం నంద్యాలలో ఎస్పీజీ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ గీత అభినందించారు. సిస్టర్ రోజా, వ్యాయామ ఉపాధ్యాయుడు ఓబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోరు నీటిని తాగవద్దు

కోవెలకుంట్ల, జూలై 29: మండలంలోని గుంజలపాడు గ్రామంలో బోర్ల నుంచి వచ్చే నీటిని తాగవద్దని గ్రామస్థులకు పంచాయతీ కార్యదర్శి అన్వర్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న రెండు బోర్లు, ఎస్సీ కాలనీలో చర్చి వద్ద ఉన్న బోరుతో కలిపి మూడు బోర్ల నుంచి వచ్చే నీటిని తీసుకుని ఇంజనీరింగ్ అసిస్టెంటు వద్ద పరీక్ష చేయగా ఆ నీటిలో ఆల్కలినిటీతోపాటు ఫ్లోరిన్ అధికంగా ఉండడంతో బనగానపల్లె ల్యాబ్‌కు పంపామన్నారు. అక్కడ కూడా ఆ నీటిని పరీక్ష చేయగా అధికంగా ఫ్లోరిన్ ఉన్నట్లు ఫలితాలు వచ్చాయన్నారు.

'స్ఫూర్తి ప్రదాతల పేర్లు పెట్టడం హర్షణీయం'

ఉయ్యాలవాడ, జూలై 29: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు స్ఫూర్తిప్రదాతల పేర్లు పెట్టడం హర్షణీయమని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ అన్నారు. సోమవారం మాయలూరు ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాకానుకకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు, విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు అబ్దుల్‌కలాం, గోరుముద్ద పథకానికి డొక్కా సీతమ్మల పేర్లు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన 117 జీవోను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి వీరబ్రహ్మం పాల్గొన్నారు.

ప్రధాన కాల్వలో నీటి ప్రవాహ పట్టికలు ఏర్పాటు

రుద్రవరం, జూలై 29: రుద్రవరం సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాలువలో 20వ బ్లాక్ చానెల్ తూము వద్ద ఆళ్లగడ్డ- నంద్యాల డివిజన్‌ల సరిహద్దు సాగునీటి ప్రణాళిక పట్టిక అధికారులు పరిశీలించారు. సరిహద్దులో నీటి ప్రవాహాన్ని లెక్కగట్టి ఆళ్లగడ్డ డివిజన్ అధికారులకు నంద్యాల డివిజన్ అధికారులు చెప్పాల్సి ఉంది. ఇలా ప్రతి డివిజన్ వద్ద ఎగువన ఉన్న అధికారులు దిగువనున్న అధికారులకు లెక్క చెప్పాల్సి ఉందని డీఈ చంద్ర ఓబుల్‌రెడ్డి అన్నారు. అందుకే ప్రధాన కాల్వలో సాగునీటి ప్రవాహం కొలిచే పట్టికను ఏర్పాటు చేశామన్నారు. డీఈ రమణ, ఏఈ రామశేషు, జేఈ రాంప్రసాద్ ఉన్నారు.

'రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి'



డీలర్‌పై ఫిర్యాదు చేస్తున్న కలచట్ల ఎస్సీ కాలనీ వాసులు

ప్యాపిలి, జూలై 29: మండలంలోని కలచట్ల ఎస్సీ కాలనీలో 40 కుటుంబాలకు జూలైకు సంబంధించి రేషన్ పంపిణీ చేయలేదని ఆ కాలనీకి చెందిన రామచంద్రుడు, ఓబులేసు సోమవారం డిప్యూటీ తహసీల్దారు మారుతికి ఫిర్యాదు చేశారు. దీంతో పేదలకు రేషన్ లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రేషన్ పంపిణీ చేయని సదరు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

గోకులం షెడ్లపై అవగాహన కల్పించండి

సంజామల, జూలై 29: గోకులం షెడ్లపై రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య పశు వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సంజామల ప్రాంతీయ పశువైద్యశాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉండి పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రస్తుతం ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్ర మత్తంగా ఉండి పశువులకు టీకాలు వేయించాలని ఆదేశించారు. పాడిపరిశ్రమ జీవనాధారంగా ఉన్న రైతులకు గోకులం షెడ్లకు దర ఖాస్తు చేయించాలన్నారు. కార్యక్రమంలో జేవీవో సుబ్బయ్య, శీను, బాషా, ఎహెచ్‌ఏలు మహబూబ్‌బేగ్, ప్రభాకర్, షరీఫ్ బాషా పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి

బేతంచెర్ల, జూలై 29: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ మధు అన్నారు. రైతులు పంట రుణాల కోసం తీసుకోవడానికి తమ భూములకు లాక్ వేశారని, వాటిని వెంటనే తొలగించాలని 5 దరఖాస్తులు వచ్చాయని డీటీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిప్రసాద్, నగర పం చాయతీ కమిషనర్ రమేష్‌బాబు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గణేష్, రాజశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాగంటిలో పల్లకీ సేవ

బనగానపల్లె, జూలై 29: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు ప్రభుత్వం చేయూత

కొలిమిగుండ్ల, జూలై 29: కౌలు రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా చేయూత అందిస్తుందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి నాగ రాజు అన్నారు. సోమవారం ఏవో భూమా జ్యోతి ఆధ్వర్యంలో మండ లంలోని గోర్విమానుపల్లె, బెలుం, బెలుంశింగవరం గ్రామాల్లో కౌలు రైతుల అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కౌలు కార్డుల కోసం దరఖాస్తులు సమర్పించారు. టీడీపీ నాయకులు పుల్లిప కాశిరెడ్డి, మూలే హుస్సేన్ రెడ్డి, విఆర్ఓ శివపార్వతి, వీఏఏ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

కొలిమిగుండ్ల, జూలై 29: కొలిమిగుండ్లలో దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్‌కు గ్రామసర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతులు నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద తాగు నీటి పైప్‌లైన్ మరమ్మతుకు గురికావడంతో ఎక్స్‌కవేటర్, కూలీల సాయంతో దాన్ని పునరుద్ధరించినట్లు సర్పంచ్ శివ తెలిపారు.

కొత్త చట్టాల గురించి తెలుసుకోవాలి: సీఐ

కొలిమిగుండ్ల, జూలై 29: న్యాయ వ్యవస్థలో కొత్త చట్టాలు అమలులోకి వచ్చినందున్న వాటి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ న్యాయవ్య వస్థపై ప్రజలు పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్త చట్టాల ప్రకారం నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

'90 రోజుల పని దినాలు కల్పించాలి'

రుద్రవరం, జూలై 29: ప్రతి ఇంటికీ 90 రోజుల పనిదినాలు కల్పించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ సాంబశివరావు అన్నారు. సోమవారం రుద్రవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడతూ కూలీ రేటు రూ.300 పెరిగినా తప్పనిసరిగా ప్రతి ఇంటికి 90 పని దినాలు వర్తించాలన్నారు. ఇష్టానుసారం వ్యవహరించవద్దని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సూచించారు. హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ నాగరాజు, ఎంపీడీవో రామచంద్ర, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఏపీవో ప్రతాప్ పాల్గొన్నారు.

3న మెగా జాబ్ మేళా

డోన్, జూలై 29: పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో ఆగస్టు 3వ తేదీన ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్న ట్లు సోమవారం టీడీపీ వర్గాలు తెలిపాయి. ఐటీ, ఫార్మసీ, సెక్యూరిటీ తదితర రంగాలకు సంబంధించిన కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాబునాథ్

బనగానపల్లె, జూలై 29: పులుల సంరక్షణ అందరి బాధ్యత అని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాబునాథ్ అన్నారు. సోమవారం బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బాబునాథ్ మాట్లాడుతూ 1913లో ప్రపంచంలో లక్ష పులులు ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 5,574 ఉన్నాయన్నారు. ఈ వందేళ్లలో 90 శాతానికి పైగా పులులు అంతరించిపోయాయన్నారు. జంతుశాస్త్రం అధ్యాపకుడు మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ 2010లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో టైగర్ సమ్మిట్ నిర్ణయం మేరకు అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. అధ్యాపకుడు రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: నల్లమల అటవీ ప్రాంతంలోని వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యతని రుద్రవరం రేంజ్ అటవీ శాఖ అధికారి శ్రీపతినాయుడు అన్నారు. రేంజ్ పరిధిలోని అహోబిలంలో సోమవారం ప్రపంచ పులుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా అటవీ అధికారి అనురాగ్ మీన ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో ర్యాలీ చేపట్టారు. వన్యప్రాణుల సంరక్షణ, అటవీ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వపోటీలు, డ్రాయింగ్ వంటి వాటిపై పరీక్షలు నిర్వహించి బహుమతులను అందజేశా రు. అటవీ అధికారులు ముర్తుజావలి, మక్తార్‌వలి, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

సామాజిక భాగస్వామ్య దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఈవో న్యామతుల్ల

చాగలమర్రి, జూలై 29: చాగలమర్రిలోని పాతబస్టాండు సమీపంలో గల ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్షసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులతో ఘనంగా నిర్వహించారు. ఎంఈవో న్యామతుల్ల మాట్లాడుతూ విద్యార్థుల సామాజిక శ్రేయస్సు కోసం తల్లిదండ్రులు తోడ్పడాలని సూచించారు. విద్యార్థులతో పెద్దలు, ఉపాధ్యాయులు కలిసి సహపంక్తి భోజనం చేశారు. టీడీపీ నాయకులు, పాఠశాల కమిటీ సభ్యులు మౌళాలి, అనీఫ్, సోనును పాఠశాల హెచ్‌ఎం మౌళాలి సన్మానించారు. పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు రవింద్రారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు చేయూత

కోవెలకుంట్ల, జూలై 29: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థినులను ఆదుకోవడమే తన లక్ష్యమని కోవెలకుంట్ల మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 650 విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎవరైనా మధ్యాహ్న భోజనం డొనేట్ చేసేవారు ఉంటే వారిని అడిగి చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అందులో భాగంగా ఉపాధ్యాయురాలు గడ్డం నాగేశ్వర్‌రెడ్డిని మధ్యాహ్న భోజనంతోపాటు స్వీట్లు అందించాలని కోరగా, నాగేశ్వర్‌రెడ్డి అందుకు అంగీకరించారు. సోమవారం భోజనం తోపాటు పాయసం తయారు చేయించి విద్యార్థినులకు వడ్డించారు.

కేసీకి జలకళ



దొర్నిపాడులో నీటితో కళకళలాడుతున్న కేసీ కెనాల్

దొర్నిపాడు, జూలై 29: గత కొన్ని రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో అన్ని ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. సోమవారం కేసీ కెనా ల్‌కు నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేసీ కెనాల్ ఆయకట్టు కింద సాగు చేసిన మినుము, మొక్కజొన్న తదితర పంటలకు ఈ నీరు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. గత ఏడాది కేసీ కెనాల్‌కు నీరు రాకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఈ ఏడాది కేసీకి నీరు రావడంతో సాగు చేసిన పంటలు సమృద్ధిగా పండుతాయన్న ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే బిజ్జం జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మారం భాస్కర్‌రెడ్డి తదితరులు

కోవెలకుంట్ల, జూలై 29: పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న బిజ్జం పార్థసారథిరెడ్డి కార్యాలయంలో సోమవారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డి 56వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. భాస్కర్‌రెడ్డి టీడీపీ అభిమానులు, పార్థసారథిరెడ్డి అభిమానులు కలిసి కార్యాలయంలో ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లి కార్జునరెడ్డి, గురప్ప పాల్గొన్నారు.

'కేజీబీవీ హాస్టల్ ఎస్‌వోను సస్పెండ్ చేయాలి'



కలెక్టర్‌కు సమస్య విన్నవిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్(రూరల్), జూలై 29: డోన్ పట్టణం సమీపంలోని కేజీబీవీ బాలికల హాస్టల్ ఎస్‌వోపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, కార్యదర్శి ధనుంజయలు డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. స్కూల్ డెవలప్మెంట్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. అలాగే పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలికల ప్రిన్సిపాల్‌పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.